పెట్టుకోలేదు. నక్షత్రకుడిని నియమించేడు. విశ్వామిత్రు డిలా కాకుండా వ్యాపారి స్వయంగా బైల్దేరితే మరీ మంచిది"

"మెలకువలు తెలిస్తే బాకీలు వసూలు చేసుకోవడం మంచి నీళ్ళప్రాయం. బాకీ తీర్చకపోతే తంతానానాలి. తన్నాలి. ఆఖరికి అప్పు చేసినవాడి కొడుకు చచ్చినా బాకీ కట్టందే శవాన్ని శ్మశానం చేరనివ్వననాలి. అప్పటికే చేర్చేస్తే కాల్చనివ్వననాలి. కాలిస్తే ఆర్పేస్తాననాలి.

ఇవి కాబూలీ నమ్మకాలు. అతను యిక్కడి ప్రజల సౌకర్యాం కోసం పెళ్ళాం పిల్లల్ని దూరదేశంలో వదిలి–వడ్డీ పుచ్చుకో కూడదన్న తనమత సిద్ధాంతాన్ని కూడా అతిక్రమించి – పెద్ద పెట్టుబడితోనే వడ్డీ వ్యాపారం చేస్తున్నాడు.

అతన్ని ధైర్యంగానే అప్పు అడిగాడు విశ్వనాథం. అతనికి యిద్దామని వున్నా యివ్వనన్నాడు. ఇవ్వలేనన్నాడు. చేతిలో కానీ లేదన్నాడు. ఈవేళ బాకీ కట్టాల్సిన కనకం కాజువల్ లీవ్ పెట్టేసేడన్నాడు. కనకం గాడు ఖచ్చితమైన బద్మాష్ అన్నాడు. నన్ను కాదని ఎక్కడికి వెళ్తాడని ప్రశ్నించేడు. ఈవేళ కాకపోతే రేపైనా అతని చేత బాకీ కక్కిస్తానన్నాడు. "కల్‌మిలో" అని ఆశ చూపించేడు.

❖ ❖ ❖

అదే రాత్రి విశ్వనాథం తన దగ్గరున్న యాభై తీసి, కాబూలీ వాడు తనకు ఆ డబ్బు యివ్వడానికి ఎన్ని తిప్పలు పెట్టేడో, ఆఖరికి తను వాడి దగ్గర ఆ మొత్తం ఎలా పీకగలిగేడో వర్ణించి చెప్పి మరీ సత్యానికి యిచ్చేడు.

అదే రాత్రి ఆ యాభై రూపాయలూ సత్యనారాయణ, వెంకట్రావు, వజీరుద్దీను, జార్జి చేతులు మారికనకారావుని చేరుకొనీ మర్నాటి ఉదయం కాబూలీ హస్తగతం అయి సాయంత్రానికి మళ్ళీ విశ్వనాథాన్ని చేరుకున్నాయి.

కాబూలీ దగ్గర డబ్బు పుచ్చుకొని జేబులో పెట్టుకుంటున్నప్పుడు విశ్వనాథానికి ఏడుపులాంటి నవ్వు వచ్చింది.

**షరా :** కాబూలీ నెలకు రూపాయికి పది పైసలు వడ్డీ పుచ్చుకొనును.

**(యువ దీపావళి, 10.11.1968)**

# మావూరు

**మా** వూళ్లో రంకుతనాలు, రాజకీయాలు, లలితకళలు!'

మా వూళ్ళో.........

చీకటి రాత్రి ఆకాశం జిలుగుపైటలా వుంటుంది.

వెన్నెల రాత్రి చంద్రుడు వెండి జరీ పువ్వులా వుంటాడు.

కొంద రాడవాళ్లు కళ్లు ఆర్చి కొంపలార్పేస్తారు.

కళ్లు టపటప లాడించి కొంప లంటించేస్తారు.

శివాలయంలోనే సారాబట్టీ.

మసీదు పక్కనే ముండల కంపెనీ.

సారా, స్మగ్లింగు ముఖ్య పరిశ్రమలు.

సెక్సు, శవ సాహిత్యాలు ప్రత్యేక ప్రక్రియలు.

మిషను ఆస్పత్రిలో మందూ, మతమూ దొరుకుతాయి.

నాయకులకి డెక్కలు కూడా మొలిచేయి.

రంకుతనాలు, రాజకీయాలు లలిత కళలు.

జమీందారుగారి భవంతికి తూర్పుగా నాలుగు ఫర్లాంగుల్లో ఒక పెద్ద కాంపౌండు గోడవుంది. అది కోటగోడలా ఎత్తుగా; ధృడంగా వుంటుంది. దాని ఆవరణలోని చెట్లు సిమెంటు చెట్లలా బలంగా ధృడంగా వుంటాయి. వాటి నీడ పాకే విషపు పొరలా వుంటుంది. ఆ కాంపౌండులోని పూల మొక్కలు ప్లాస్టిక్ మొక్కల్లా అసహజ సౌందర్యం కలిగి వుంటాయి.

ఆ ఆవరణలో ఒక బంగళా వుంది. ఆ బంగళాలో ఖూనీ చేస్తే చచ్చినవాడి కేక రోడ్డుమీదకు వినిపించనంత దూరంగా వుందది. దానిమీద శ్మశానపు నిశ్శబ్దం ఎప్పుడూ బరువుగా కూర్చున్నట్టుంటుంది. అందులోని నౌకర్లు నడిచే మైనపు బొమ్మల్లా ప్రాణరహితంగాను, నమ్రంగాను వుంటారు. ఆ బంగళాలో ఎందులోనూ చౌకతనం కన్పించదు, దాన్లో బాత్‌రూములు నీ బంగళా అంత వుంటాయి. దాన్లో రేడియోగ్రాం పందిరి మంచం అంత ఉంటుంది.

ఆ బంగళా రాజావారిది. రాజావారికి రాణీలు వున్నారు. కాని, వారు "రాజుగారు' కారు. వారి తాతగారికి తురాయిపాగా లేదు. వారి తండ్రి గారికి రావు బహద్దూర్ వుండేది. వారు కొత్తరకం పాలకుల జాతికి (Ruler's caste) చెందినవారు.

రాజావారి మొహమ్మీద వుండే పాల పొంగులాంటి చిరు నవ్వు అతని ఏభైయేళ్ళ వయస్సుని మరుగుపరుస్తుంది. వారిలో ఏ చౌకతనం వెతికినా కన్పించదు. వారు పట్టు మనిషిలా మెరుస్తూ వుంటారు. రాజునీ, రాజయోగినీ కలిపి చేసినట్టు వారు అధికార యుక్తంగా, ఆత్మవిశ్వాసంతో వున్నట్టు కనిపించడమే కాక ఎదుటి వారిలో ఒకవిధమైన అల్పత్వం (Inferiority) కలగచేస్తారు.

వారు కాలక్షేపానికి కాలేజీకి వెళ్ళేరు. వారికి వున్న కార్ఖానాల యాజమాన్యంతోనూ, రాజకీయ నాయకత్వంతోనూ వారికి తీరుబడే వుండదు. మావూరు ఏ V.I.P లు వచ్చినా, సినిమా వాళ్లు వచ్చినా, స్వామీజీలు వచ్చినా, వారింటిలోనే బసచేస్తారు.

వారింటికి రకరకాల మనుషులు వస్తారు. నానా అవస్థలలో వున్న మనుషులూ వస్తారు. ప్లీడర్లు, పార్టీలు, అధికార్లు, బంట్రో తులు, న్యాయంకోరేవారూ, అన్యాయం చేసేవారూ, పోలీసులు, కేడీలు...యింకా ఎన్నో రకాల పురుషులు వస్తారు. వారందరి మీదా రాజా వారికి బలమైన పట్టూ, ప్రాబల్యం వున్నాయి. వారిమాట ఏ ఆఫీసరూ కాదనడన్న విషయం ఆఫీసర్లతో సహా అందరికీ తెలుసు. వారు 'దర్బార్' మేడమీద హాల్లో జరుపుతారు. ఆహాల్లోని చదరంగపు గళ్ళలాంటి మొజాక్ ఫ్లోరింగ్ చావులా చల్లగా వుంటుంది. ఆహాల్లో రాజకీయ పాచికలు వేస్తారు. వ్యక్తి గత పేచీలు లేపుతారు. అందులోనే ఎంతోమంది నాయకులు ప్రసవించబడి సంహరించబడ్డారు.

రాజావారు ఎవరితోనూ స్వయంగా మాట్లాడరు. ఎవరు ఏగోడు చెప్పుకున్నా వారు వినడం మాత్రమే చేస్తారు. ఆ తర్వాత వారి అంతరంగికులు వారి తీర్పులూ, నిర్ణయాలూ, అభిప్రా యాలూ, అసమ్మతులూ సూచనప్రాయంగా తెలియచేస్తారు. అవి మా వూరి సగం ప్రజలకి శిలాశాసనాలు.

❖ ❖ ❖

ఆ రాత్రి, వెన్నెల ఆ బంగళాకి వెండి పొర చుట్టింది. వెన్నెల సౌందర్యాన్ని ఆస్వాదించడానికేనేమో అనిపించేటట్టు ఆయింట్లో అన్ని దీపాలు ఆర్పేసేరు, ఒక్క హాల్లో తప్ప.

ఆ హాల్లో వున్న రాజావారు, ఎప్పుడో కాని అసిస్టెంట్లకి దర్శనమివ్వని సినిమా దొంగల నాయకుడిలా, దర్జాగా, ఆత్మ విశ్వాసం వుట్టిపడుతూ వున్నారు. వారి ముందున్న వారు మాత్రం అసిస్టెంటు దొంగల్లా కాకుండా అసలు దొంగల్లాగే వున్నారు. వారంతా రాజావారి అంతరంగికులు. వారిలో పాములూ, ముంగిసలూ, పందికొక్కులూ, పెద్ద పులులూ, కుక్కలూ, తేళ్ళూ వున్నాయి. వారంతా ఆవూరి రాజకీయాల్లో ఒకపార్టీకి చెందిన వారు.

"ఇంతకీ ఆ విశ్వనాథం ఉద్దేశ వేఁవిఁటో?' అని జనాంతికం గానే అడిగేరు రాజావారు.

అక్కడున్న ప్రతివాడూ తననే యీ ప్రశ్న అడిగినట్టు ఫీల య్యేడు. కాని ఎవరూ జవాబు చెప్పలేదు.

'కర్తవ్యం ఏఁవిఁటో ఆలోచించండి' అని అంటూ లేచి మేడ దిగి వెళ్లి పోయేరు రాజావారు.

'కర్తవ్యాని కేటుందిగాని, మూడు లచ్చలు కరుసు పెట్టిన మనకీ పదేను మందిరే కవున్సిలర్లు- మూడ్డబ్బులకి మూతినాకే రామ్మూర్తి కుక్కకీ పదేను మందిరే కవున్సిలర్లు. గోరకలి కాపోతే యింకేటి? తలుసుకుంటే తల తిరిగిపోద్ది!'

'మన గింజగాడీని లాగీకముందు మనకి రెండు ఓట్ల మెజారిటీ వుండేది.'

'కిందటి కౌన్సిల్లో పదిఓట్ల మెజారిటీ వుండేది. ఎందుకీ గతజల సేతు బంధనం.?'

'రామ్మూర్తి సంగతికేం గాని విశ్వనాథం సంగతి తేల్చండి. అతగాడెటుంటాడు?'

'పచ్చగడ్డిలో పసరికపాములాగున్నాడు.'

'ఎటుండేదీ. ఎక్కడుండేదీ తేలడం లేదు.'

'తేలడాని కేటుంది. నాలుగు డబ్బులు తగలేసి నలుగురు సన్నాసోళ్ళతో నిలబడ్డాడు. పుచ్చువిత్తనంగోడు మొక్క మొలుస్తాదే టిలే నన్జెప్తి మనవూఁ ఒగ్గేసినాం. రామ్మూర్తీ ఒగ్గేసినాడు. మనకీ, ఆడికీ కలిపి కందుజెల్లకొట్టేసి అయిదు సీట్లూ తన్నుకుపోనాడు.'

'అతగాడిది కూలీల పార్టీ'

'ఏఁవిఁటోయ్ నువ్వు మరీను? మనదికాదూ కూలీలపార్టీ? ఆ మాటకొస్తే మనమంతా ప్రజలదగ్గర కూలి పుచ్చుకుంటున్న సేవకులం గాఁవూఁ?'

'అతగాడు తెలగా అట'

'మన నాయుణ్ణి ఛేయిర్మన్ చేస్తే!'

'కిందటి పాలి నాయుడే- యీ పాలీ నాయుడే!'

'ఈమారు వంతు పంతుల్ది'

'ఈ కమ్యూనల్ జి.వో......'

'దొరలు మన కిచ్చిన పథకం'

'మన పురాణాల్లో ఔతారాలు సూడు. యిద్దరు బేపనోళ్ళు– ముగ్గురు నాన్ బ్రామ్మిన్సూ– ఒక బేక్‌వరుడు క్లాసోడూ.....'

'సర్లే. అవతారాల కేంగాని....'

'అతను పేదలకి సేవ చెయ్యడానికే పార్టీ పెట్టేట్ట. ఈ మారు ఐదు సీట్లు రావడం మనుషుల మంచితనమే రుజువు చేస్తుం దిట.'

'వచ్చేసారి పదిసీట్లు వస్తాయట.'

'ఆ వచ్చేపాలి పదూళ్ళు ఒస్తాయి. ఆ వచ్చే పాలి పది జిల్లా లొస్తాయి. మనం సెప్పనేదూ యీ సొళ్ళు కబుర్లు!'

'ఏ పార్టీలోనూ చేరడట?'

'అంటే థర్డుఫోర్స్ (Third force)

'తెలుగు నేడు గబ్బిలవాఁ?'

'కొట్టో, కొనో అతగాణ్ణి లాగా లన్నమాట.'

'అన్నమాటా కాదు, తమ్ముడిమాటా కాదు. లాగాలి'

'ఆడి కొంపకి నిప్పంటించి కొత్తది కట్టించేస్తే?'

'కాంతా కాంచనాలకి లొంగని వారు లేరంటారు.'

'ఐతే దుడ్డిద్దామా, దురగమ్మ నంపుదాఁవాఁ?

'డబ్బు పుచ్చుకొని దురగమ్మతో సహా అవతలి పార్టీలో కలిసిపోతే?'

'ఎవుడూ? ఆడా మనవాఁ?

'ఆడేనేస్'

'అతడికి డబ్బాశ నేదట'

'ఆడి పెళ్ళాం కోకలు ఆడే వుతుక్కుంటాడట'

'ప్రేమా? కక్కుర్తా?'

'రెండూ నేమో'

'ఈ పాతికేళ్ళై హుటేలు నడుపుతూ బాగా కుదుటపడి పోయేట్ట'

ఈలోగా రాజావారు వచ్చేరు. 'ఏఁవింటి మీ నిశ్చయం?' అంటూ.

'ఏటుంది బాబూ. ఆ విస్సినాథం ఎటుంటే అటు మొగ్గుతాది తాసు.'

'ఏం చెయ్యాలి మనం?' రాజావారే అడిగేరు.

ఎవరూ జవా బియ్యలేదు.

'సర్లెండి. సర్వం సర్వేశ్వరుడికే వదిలేద్దాం. యింక లేవండి.'

❖ ❖ ❖

అప్పుడే నిద్ర లేచిన రమాకాంత్‌కి పొద్దు పొడుస్తున్నదో. పోతోందో తెలియలేదు. కాని ఏమౌతున్నా బహు సుందరంగా మాత్రం ఔతున్నాది అనిపించింది.

పసుపూ, కుంకం రాసుకున్న పుణ్య స్త్రీ మొహంలా నిండుగా వుంది ఆకాశం.

అతని మేడగది కిటికీ అవతల తెర అప్సరస బంగారు చెంగులా ఎగురుతోంది.

కిటికీ అవతల పొదలో పిట్టలు ప్రేమ పాఠాలు వల్లించు కుంటున్నాయి.

రమాకాంత్ పక్కమీంచి లేచి బద్ధకంగా ఒళ్లు విరుచు కున్నాడు. అతను పుష్టిగా, ఆరోగ్యంగా కొత్తటూత్ పేస్టుట్యూబ్‌లా వున్నాడు. అతను ఏ కోర్సు చదవకూడదో ఆ కోర్సు ఫైనలియరు చదువుతున్నాడు.

రమా కిటికీ దగ్గరకు వెళ్లేసరికి రోడ్డుమీద రాధ నిలబడి వుంది.

పువ్వులూ, రవ్వలూ కలిపి గుచ్చెత్తి నట్టు ఆమె మనోహరంగా వుంది.

ఆమె కళ్లు మల్లెల్నీ, మత్తుపదార్థాల్నీ గుర్తు చేస్తాయి.

ఆమె నవ్వు కొంతమందికి పసిపాప పలుకులా అమాయకం గానూ, చాలా మందికి ప్రియురాలి సైగలా రేకెత్తిస్తూనూ కని పిస్తుంది.

'కాపరానికి వెళ్లేక కండపట్టింది' అనుకుంటూ రమా సన్నాయి నొక్కులా యీలకొట్టేడు. కలలో జడుసుకున్న మనిషిలా తత్తర పడి వంచినతల ఎత్తకుండా వెళ్లిపోయింది రాధ.

మూడు నెలలై నిద్రలేచి సింహంలా కదిలేడు రమా.

❖ ❖ ❖

ఊళ్లో ఆ భాగంలో కారులున్న వాళ్ళూ, కొంపలు తీసే వాళ్లూ కాపురం వుండరు. అక్కడ పూరిళ్ళు లేని కొందరు పాత పెంకు టిళ్ళలో కాపురాలు వుంటారు. అక్కడ చాలామందికి రెక్కలే ఆడతాయి.

ఆ భాగంలో ఒక పాత పెంకుటిల్లు.

ఆ యింటికప్పు ముసలి జంతువు నడుములా ఎండిపోయి, వంగిపోయి వుంది.

ముళ్ళకొమ్ములకి తగిలి చిరిగిపోయిన వెన్నెల ముక్కలు ఆ యింటిమీద అక్కడా, అక్కడా పడుతున్నాయి. ఆ యింట్లో రాధ పడుకున్న ఒక్క గదీ కొత్తబట్టల వాసనతోనూ, రంగుల వాసన తోనూ నిండిపోయి వుంది.

పాతపత్రిక తిరగేస్తున్న రాధ పట్టుచీర కట్టుకున్న పింగాణీ బొమ్మలా చేతికి దొరకని అందంతో మిలమిలలాడుతోంది.

పత్రికలో బొమ్మమీద ఆమె దృష్టి నిలిచిపోయింది. ఆ బొమ్మలో యువకుడు కళ్ళు మూసుకొని పోయేటంతగా నవ్వు తున్నాడు. మూర్తి నవ్వినా అతనికళ్లు అలాగే మూసుకుపోతాయి. మూర్తి గుర్తుకు వచ్చి ఆమె కలవరపడింది. అతను చెంత లేన ప్పుడు ఎప్పుడు గుర్తొచ్చినా ఆమె అలాగే బాధ పడుతుంది. అతను దగ్గరుంటేనే తన పాపభారం తగ్గినట్టు అనిపిస్తుంది. అతన్తో అంతా చెప్పేసి తన పాపం కడిగేసు కుందామని ఆమె ఎన్నిసార్లు ప్రయత్నించినా, నాలిక మడతపడి, మాట వచ్చేది కాదు.

'ఈ భారం ఎన్నాళ్లు మోయను ప్రభూ? నా పాపం వెల్లడి చేసే శక్తి యివ్వకపోతే నన్ను చంపెయ్' అని ఆమె దేవుణ్ణి ఎన్నోసార్లు అతి దీనంగా వేడుకుంది.

'నెలలో తిరిగొచ్చేస్తావుగా, ఏఁవిటాఁ దిగులు' అంటూ మూర్తి రైలు ఎక్కించినప్పుడు ఆమె కంటి నీరు అతనికి కనపడ నివ్వలేదు.

వీధి తలుపు ఎవరో కొడితే ఆమె ఆలోచనల ఊబినుంచి బైటపడింది, 'ఇప్పుడే సినీమాకి వెళ్లిన అమ్మా నాన్నా అప్పుడే వచ్చేసేరేం? టిక్కెట్లు దొరకలేదేమో' అనుకుంటూ తలుపు తీసింది.

తల్లి కోసం ఎదురుచూస్తున్న గువ్వపిల్లకి గూబ ప్రత్యక్షమై నట్లు అనిపించింది ఆమెకు రమాను చూడగానే.

విషపు వరదలో కొట్టుకుపోతున్న తన నావ బద్దలై పోతు న్నట్టూ– ప్రపంచంలో అంతా చచ్చిపోయి తను ఒక్కర్తై మిగిలి నట్లు ఆమె ఎంతో నిస్సహాయత ఫీలైంది.

'ఎలా వున్నావ్?' అంటూ రమాప్రవేశించేడు నవ్వుతూ.

పారిపోతున్న లేడిపిల్లని పట్టుకొని 'ఎలా వున్నావ్' అనడుగు తున్న పులి నవ్వులా వుంది అతని నవ్వు.

'ఎందుకొచ్చేవ్?' ధైర్యం చేసింది రాధ.

❖ ❖ ❖

బైట ప్రపంచం బంగారు కుంకుమ భరిణలా శుభ్రప్రదంగా వుంది.

గర్భగుడిలో నూనె దీపంలా వున్న తల్లి నుదుటి తిలకంతో ఆడుకుంటోంది అప్పుడే లేచిన ఎదురింటి పసిపిల్ల.

పువ్వులూ, నవ్వులూ మూటకట్టుకున్న పడుచులా మెల్లగా వస్తూంది చల్లగాలి.

ప్రియుడు వేడిశ్వాసలో అందంగా. ఆనందంగా వాడి పోతూంది పక్కింటి పువ్వుల చీరపిల్ల.

రాధ యిల్లు మాత్రం భూకంపం పగిల్చిన ఊరులా భీభ త్సంగా వుంది. రాధా రమా భీకరంగా పోరాడుతున్నారు. దెబ్బ లాటలో కిందపడిపోయిన రాధ శివుని మెడలోంచి జారిపడ్డ నాగరాజులా తల ఎత్తింది. తాగలేని రక్తం మొహానికి రాసుకొని ప్రజ్వరిల్లిన అమ్మవారులా లేచింది ఆమె.

రెండు తలల వింత పశువులా రమా కలియబడ్డాడు. చిరి గిన ఆమె జాకెట్టూ, తొలగిన ఆమె చీరా అతనిలో పది దెయ్యా లని ప్రవేశపెట్టేయి.

పిల్లని రక్షించుకోవడానికి పులితో పోరుతున్న ఆవులా ఆమె బలం పెరిగిపోయింది. రమా మెడని ఆమె చేతితో చుట్టింది. అడవి యేనుగ తొండం చుట్టుకున్నట్టనిపించింది అతనికి.

అతని చెయ్యి గూటిలో సీసా వేపు చావు నీడలా చల్లగా పాకింది.

'మర్యాదగా లొంగేవ సరే. లేకపోతే....' అతను వాక్యం పూర్తి చెయ్యలేదు.

❖ ❖ ❖

'పూర్‌గర్ల్! షి విల్ లివ్...బట్' (Poor girl! she will live...but) వాక్యం పూర్తి చెయ్యలేదు ఆపరేషను థియేటరు నుంచి బైటకు వచ్చిన డాక్టరుగారు.

థియేటరు పెళ్లి యిల్లులా కళ కళ లాడుతోంది.

పెళ్లి పీటల మీదే ప్రాణాలు వదిలేసిన పెళ్లి కూతురిలా లైట్ల కింద టేబిలు మీద పడివుంది రాధ.

❖ ❖ ❖

ఆ మర్నాడు ఊరినిండా తులం నిజానికి అర్ధమణుగు అబద్ధం కలిపి కళ్ళాపు జల్లింది పుకారు.

'అది ఆ బాబుకీ పాత కాతాయే నట'

'పెళ్లి కాకముందు అతన్ని ఆమె రేప్ (Rape) చేసేసిందట.

'హమ్మ ముండా! తండ్రిని సెరిపీసే రకం కాదుటే నువు!'

'నిన్న రాత్రీ ఆవిడే పిలిచిందిట'

'గూట్లో సీసా ఎలక తోసేస్తే....'

'కేసెట్టేసినాది'

❖ ❖ ❖

రాత్రి పది కొట్టలే దింకా.

రాజావారి హాల్లో షాండెలీర్ (chandelier) వెలుగులు చిమ్మే పారిజాత పుష్పంలా వుంది.

గాంధీగారిని బతికుండగానే చట్రంలో పెట్టి బిగించేసి నట్టుంది జీవకళతో తూర్పు గోడనున్న లైఫ్‌సైజు పెయింటింగ్.

రాజావారి మొహంలో ఆత్రుత, ఆనందం ఛాయామాత్రంగా కూడా కనిపించలేదు. వారు అతి హుందాగా కుర్చీలో కూర్చుని కళ్లు మూసుకొని వున్నారు.

కృష్ణుని ముందు కుచేలుడిలా అతిదీనంగా వారిముందు విశ్వనాథం నిలబడి వున్నాడు.

'సరే మీరు వెళ్ళండి మిగతాది మేము చూసుకుంటాము' అని రాజావారు లేచేరు. విశ్వనాథం వెళ్ళిపోయేక వారు కొంత మందికి ఫోను చేశారు. మరికొంతమందికి కబురు చేశారు.

ఆ రాత్రి వారింటికి చాలామంది వచ్చేరు. వచ్చిన వారిలో పెద్దలు, పిన్నలు, డాక్టర్లు, డాఫర్లు, పోలీసులు, పుండాకోర్లు రక రకాలున్నారు.

❖ ❖ ❖

'మరి కొన్నాళ్ళకు జరిగిన ఎలక్షన్లో విశ్వనాథం పార్టీ సహా యంతో రాజావారి అభ్యర్థి పంతులు ఛైర్మన్ అయ్యేడు.

❖ ❖ ❖

దసరా రైలు అల్లుళ్ళ వాసనలతో, ఆడవాళ్ళ పట్టుచీరల సరసరలతో నిండిపోయింది.

రైల్వే స్టేషను విడిది యిల్లులా కళకళలాడుతోంది. ఒక అరవ అతివ ముక్కుపుడకలో పడిన ట్యూబ్‌లైటు కాంతి మూరెడు ముక్క అయింది.

ఒక ఫస్టుక్లాస్ పెట్టెదగ్గర విశ్వనాథం దేశ సారధ్య బాధ్యత సగం తనే మోస్తున్నట్టు కుంగిపోయి నిలబడ్డాడు.

చివరి పెట్టెలో రాధ కిటికీ దగ్గర పక్కకి తిరిగి కూర్చుంది. ప్లాట్‌ఫారం మీదికి ఆమె మొహం కుడిభాగం మాత్రం కని పిస్తుంది.

ఎవరో ఓల్డు మాష్టరు (old master) చిత్రించిన అపురూప చిత్రంలా వుంది.

ఆమె కన్ను పన్నీటి సరస్సులో పూసిన వింత పువ్వులా వుంది.

చిరునవ్వులు పూసే సింగారపు కొమ్మలా వుంది ఆమె పెదవి వంపు. రైలు కదిలింది.

'చదువు పూర్తయేవరకు మళ్లీ వెధ వ్వేషాలెయ్యకు, ఈ గండం గడిచేసరికి తల ప్రాణం తోకకి వచ్చింది' అంటూ డబ్బు అందిం చేడు విశ్వనాథం. డబ్బు పుచ్చుకుంటూ తండ్రికి నమస్కరించేడు రమా.

దూరమైపోతున్న స్వంత వూరిని పూర్తిగా చూడడానికి రాధప్లాట్ ఫారం వేపు పూర్తిగా తిరిగింది.

ఆమె ఎడమవైపు మొహం.... కారిపోయిన కంటితో, కాలి పోయిన చెంపతో, సగం కాలిన శవం మొహంలా, చర్మంలేని మాంసంలా వికృతంగానూ, బతికుండగానే పురుగులు తినేసి నట్టు అతి అసహ్యంగానూ వుంది.

అప్పుడామె చీకటి కంటినుండి ఆమె మొహాన్ని తినేసిన ఏసిడ్ (acid) లా ఒక కన్నీటి చుక్క మా వూరి గడ్డపై పడింది.

ఆమె, ఆ చుక్క విషపు వరదై ఊరిని ముంచెయ్యాలని శపించిందో లేక అమృతధారై మంచి గుండెలు పండించాలని దీవించిందో తెలియదు.

**(జ్యోతి దీపావళి, 10.11.1968)**